పంటకు భరోసా.. రైతుకు కులాసా..

- ఈ-క్రాప్‌తో అనేక ప్రయోజనాలు
- కౌలు రైతులకు కూడా అవకాశం

రాజానగరం: ఆరుగాలం శ్రమించి పంటలను పండించే రైతులకు ఈ-క్రాప్ విధానంతో బహుళ ప్రయోజనాలు కలుగుతాయి. అన్నదాతలకు మేలు చేకూర్చే ఈ విధానాన్ని అందరూ ఆచరించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన ప్రక్రియ క్షేత్ర స్థాయిలో వేగంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ-క్రాప్ వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకుందాం.

ఆన్‌లైన్ ప్రక్రియ

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వ్యవసాయ, ఉద్యాన పంటల వివరాలను శాఖల వారీగా ఆన్‌లైన్ చేసే ప్రక్రియ (ఈ-క్రాప్)ను గత నెలలోనే ప్రారంభించారు. ఈ ప్రక్రియలో పంట సాగు హక్కు పత్రాలు పొందిన రైతులకు కూడా అవకాశం కల్పించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంటలు పాడై, నష్టానికి గురైతే ఈ-క్రాప్‌లో నమోదైన వివరాల ఆధారంగా బాధిత రైతులకు నష్టపరిహారం అందించడానికి అవకాశం ఉంటుంది.

రైతు సేవాకేంద్రాలు

రైతులు తమ సమీపంలోని రైతే సేవాకేంద్రాలకు వెళ్లి తమ పంట వివరాలను నమోదు చేయించుకోవచ్చు. సాగు చేస్తున్న భూమికి సంబంధించిన సర్వే నంబరు, పట్టాదారు పాస్‌బుక్, సాగు చేసిన పంట వివరాలు, సాగు విస్తీర్ణం, మున్నగు వాటిని తెలియజేయాలి. ఇప్పటికే పలుచోట్ల ఆర్‌ఎస్‌కేల్లో ఉండే గ్రామ వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలు తమ పరిధిలోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేసే పనిలో ఉన్నారు.

64,965 ఎకరాల్లో వరిసాగు

రాజానగరం, అనపర్తి నియోజకవర్గాలలో సుమారు 64,965 ఎకరాల వరి సాగు విస్తీర్ణం ఉండగా, ఇంత వరకూ 52,235 ఎకరాలలో పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేశారు. ఇవి కాకుండా 36,397 ఎకరాలలో మామిడి, జీడిమామిడి, నిమ్మ, నారింజ, బత్తాయి, సీతాఫలం, సపోటా, పనస వంటి ఉద్యాన పంటలు కూడా ఉన్నాయి.



ఈ-క్రాపింగ్ చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

సత్వరమే చేయించుకోండి



రైతులు తాము సాగు చేస్తున్న పంట వివరాలను సత్వరమే ఈ-క్రాప్ చేయించుకోవాలి. క్షేత్రస్థాయిలో రైతు సేవా కేంద్రాల గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు పొలాలను సందర్శించి, ఈ ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. రాజానగరం మండలంలో 10,720 ఎకరాల్లో వరి, 16 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు 7,834 ఎకరాలలో ఈ-క్రాప్ జరిగింది. మిగిలిన రైతాంగం కూడా సత్వరమే నమోదు చేయించుకోవాలి.

– అన్నమరాజు కల్యాణ్ సూర్య కుమార్, వ్యవసాయాధికారి, రాజానగరం

ఎంతో మేలు



ఈ-క్రాప్ వల్ల రైతులకు మేలు జరుగుతుంది. ఏ పంటను ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు, ఎంత మేరకు దిగుబడులు వస్తాయో కచ్చితమైన గణాంకాలు వేసుకునేందుకు అవకాశం ఉంటుంది. అలాగే ప్రకృతి వైపరీత్యాల సమయంలో పూర్తి స్థాయిలో నష్టపరిహారం పొందేందుకు కూడా ఈ విధానం ఉపయోగపడుతుంది.

– ప్రగడ రాంబాబు, రైతు, నరేంద్రపురం

క్లుప్తంగా

20 లీటర్ల సారా స్వాధీనం



వడిశలేరులో సారాతో మహిళను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు

రంగంపేట: మండల పరిధిలోని వడిశలేరు గ్రామంలో శుక్రవారం దాడులు నిర్వహించినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఈ సందర్భంగా సారా విక్రయిస్తున్న బొమ్మొత్తుల అనంత లక్ష్మిని అదుపులోకి తీసుకుని, ఆమె నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతలక్ష్మికి సారా సరఫరా చేసిన కురుకూరి వెంకటేష్‌ను అరెస్టు చేసినట్టు లిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

పెదపూడి: ఉపాధి హామీ పథకంలో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆ పథకం పీడీ, ప్రిసైడింగ్ అధికారి అడపా వెంకటలక్ష్మి హెచ్చరించారు. పెదపూడి మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం 18వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత రామేశ్వరం గ్రామంలో డీఆర్పీలు, వీఎస్‌ఏలు చేసిన తనిఖీ నివేదికలను చదివి వినిపించారు. అనంతరం మిగిలిన గ్రామాల్లో జరిగిన పనులను వివరించారు. ప్రిసైడింగ్ అధికారి వెంకటలక్ష్మి మాట్లాడుతూ మండలంలో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకూ రూ.10,88,49,295 విలువైన ఉపాధి పనులు జరిగాయన్నారు. వాటిలో ఫొటోలు సరిగ్గా లేక, కొలతల్లో తేడాల కారణంగా రూ.11,500, అలాగే మస్తర్లలో దిద్దుబాట్లు, నిధులు దుర్వినియోగం మొదలగువాటికి సంబంధించి రూ.81,702 రికవరీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, ఏపీడీ వసంత మాధవి, డీవీఓ, ఎఫ్‌ఎం విజయకుమార్, ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి, ఏపీఓ ఎం.సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎంఏ పొలిటికల్ సైన్స్‌ను కొనసాగించాలి

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఎంఏ పొలిటికల్ సైన్స్ గ్రూప్‌ను యథాతథంగా కొనసాగించాలని ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ విద్యార్థి సంఘాల ప్రతినిధులు వై.భాస్కర్, ఎస్.రాజా, వి.రాంబాబు, డి.అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఈ గ్రూపులో వచ్చిన కొన్ని సమస్యలను సాకుగా చూపిస్తూ ఈ విద్యా సంవత్సరం నుంచి ఈ గ్రూపులో అడ్మిషన్లు లేకుండా చేయాలని యూనివర్సిటీ అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి నిర్ణయాలు విద్యార్థులకు భవితకు ఇబ్బందిగా మారతాయన్నారు. అధ్యాపకుల మధ్య తలెత్తిన వివాదాలను పరిష్కరించకుండా ఏకంగా గ్రూపునే లేపేయాలనుకోవడం సరైన నిర్ణయం కాదన్నారు. ఈ విషయమై పునరాలోచన చేసి, విద్యార్థులకు భవితను కాపాడాలని కోరారు. ఇందుకోసం అవసరమైతే పోరాటాలకు కూడా తాము సిద్ధమవుతామన్నారు.

వినాయకునికి ప్రత్యేక పూజలు



పందలపాక రెడ్ల రామాలయంలో గణపతికి పూజలు

బిక్కవోలు: గణపతి నవరాత్ర ఉత్సవాలు మండలంలో ఘనంగా జరుగుతున్నాయి. పందలపాకలోని వెలంపేట రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకునికి శుక్రవారం కూనిరెడ్డి సాంబశివ, తులసి దంపతులు, అలాగే రెడ్ల రామాలయం వద్ద పడాల సత్యనారాయణ రెడ్డి, అరుణ కుమారి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కట్లమ్మతల్లి ఆలయం వద్ద చిన్నారులు బాల వర సిద్ధి వినాయక మండపం ఏర్పాటు పూజలు జరిపారు. బిక్కవోలు, బలభద్రపురం, తోస్సిపూడి, కొమరిపాలెం, కొంకుదురు, ఊలపల్లి, తొస్సిపూడి గ్రామాల్లో ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రాజమహేంద్రవరం సిటీ: కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం జిల్లా మాజీ అధ్యక్షుడు తోట రామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకులు శుక్రవారం దివాన్ చెరువులోని విజయ భారతి చెస్ట్ హాస్పిటల్ ప్రాంగణంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి, పార్టీ విషయాలను చర్చించారు. కార్యక్రమంలో కొవ్వూరు టౌన్ పార్టీ అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు ఇంటి వీర్రా జు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన యాగం

కోరుకొండ: స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్రం సందర్భంగా శుక్రవారం సుదర్శన యాగం నిర్వహించారు. ఆలయాన్ని దత్తత తీసుకున్న అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పవన్ శాస్త్రి (బ్రహ్మ) అర్చకస్వామి ఆధ్వర్యంలో మంత్రోచ్ఛారణ నడుమ యాగం జరిపారు. నిడమనూరి ఆదినారాయణ, చినబాబు దంపతుల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ధర్మకర్త రంగరాజ బట్టార్, సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, కర్రి గణేష్ పాల్గొన్నారు.

మునికూడలి ఘాట్‌లోనే విగ్రహాల నిమజ్జనం

సీతానగరం: మండలంలోని వినాయక విగ్రహాల నిమజ్జనానికి మునికూడలి ఘాట్‌ను కేటాయించినట్టు తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఆయన శుక్రవారం ఆ ఘాట్‌ను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గోదావరి వరద ఉధృతంగా ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకుని మునికూడలి ఘాట్‌ను గణపతి విగ్రహాల నిమజ్జనానికి ఎంపిక చేశామన్నారు. నిమజ్జన సమయాలను తెలియజేస్తామని, నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వరద తగ్గుముఖం పడితే మరిన్ని ఘాట్లను ఎంపిక చేస్తామన్నారు.

టీచర్ అరుణ సేవలు అభినందనీయం

రంగంపేట: చంద్రేడులోని మండల ప్రజా పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గరిమెళ్ల అరుణ విద్యాభివృద్ధికి అందించిన సేవలు అభినందనీయమని మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు కొనియాడారు. ఆమె ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం ఆ పాఠశాలలో సత్కార సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో మాట్లాడుతూ అరుణ టీచర్ నేటి ఉపాధ్యాయ లోకానికి ఆదర్శనీయమన్నారు. పూర్వపు మండల విద్యాశాఖ అధికారి ఎమ్మెస్సార్ మూర్తి మాట్లాడుతూ 28 ఏళ్ల పాటు రంగంపేట మండలంలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా పనిచేసి ఎందరో విద్యార్థులకు వెలుగుబాట చూపారన్నారు. మాజీ ప్రధానోపాధ్యాయుడు ఏ.ఫణికుమార్, ప్రధానోపాధ్యాయుడు పంపన శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం అరుణ, సూర్యనారాయణ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆంగ్లోపాధ్యాయుడు మునుకుట్ల శివరామకృష్ణశర్మ, వెంకటేశ్వరశర్మ, సూర్య కమల, శ్రీనివాస్, పద్మావతి, రంగంపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి, చంద్రేడు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గంటా రమణబాబు, కాకినాడ అన్నవరం సత్యదేవ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్ఎన్ మూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయురాలు అరుణ దంపతులను సత్కరిస్తున్న ప్రముఖులు

స్వామిత్వ సర్వేలో కచ్చితత్వం పాటించాలి

కోరుకొండ: రీసర్వే, స్వామిత్వ పనులపై ప్రత్యేక దృష్టి సారించినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఆమె శుక్రవారం కోరుకొండ ఎంపీడీవో కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వే పనులను కచ్చితత్వంతో చేపడుతున్నా ఇంకా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. వ్యవస్థను స్థిరీకరించడానికి అందరూ తమ విధులను సక్రమంగా నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు సేవలు అందించే క్రమంలో నిర్లక్ష్యం వహిస్తే ఊరుకోబోనని హెచ్చరించారు. డేటా ప్రక్రియలో తప్పిదాలకు అస్కారం ఉండకూడదన్నారు. సమావేశంలో డివిజనల్ అభివృద్ధి అధికారి పి.వీణాదేవి, డిప్యూటీ ఎంపీడీవో బి.మహేష్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



కోరుకొండలో సర్వే వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

పెదపూడి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని డిప్యూటీ ఎంపీడీవో మేడపాటి సత్యనారాయణ రెడ్డి అన్నారు. పుట్టకొండ శివారు గరువు మీద శుక్రవారం తడి, పొడి చెత్త సేకరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా డస్ట్‌బిన్లలో వేసి క్లాప్ మిత్రలకు అందించాలని సూచించారు. గ్రామంలో చెత్త కుప్పలు, మురుగు కాలువలో పూడిక తొలగించాలని, దోమల నివారణకు మందు పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



పుట్టకొండలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి

చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలి

బిక్కవోలు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలని పందలపాకలోని పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చిర్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. క్రీడాదినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆ పాఠశాలలో లయన్స్ క్లబ్ గొల్లల మామిడాడ శ్రీసూర్య సభ్యుల సహకారంతో విద్యార్థులకు బహుమతులు అందించారు. ముందుగా హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్, తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం పీడీ యువ రాజారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు క్రీడా విన్యాసాలు, యోగాసనాలు వేశారు. అలాగే బిక్కవోలు ఉన్నత పాఠశాలలో క్రీడా,తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు.



పందలపాకలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రముఖులు

సాగులో అధిక దిగుబడులు సాధించాలి

రాజానగరం: సాగులో అవకాశం ఉన్నంత మేరకు ఖర్చులను తగ్గించుకుంటూ అధిక దిగుబడులు సాధించే దిశగా అడుగులు వేయాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సేద్యపు విభాగం అధిపతి డాక్టర్ పి.మునిరత్నం రైతులకు సూచించారు. దివాన్ చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన.. అక్కడ ఉన్న శాస్త్రవేత్తల పనితీరును పరిశీలించారు. అనంతరం కోరుకొండ, సీతానగరం మండలాల్లోని రైతు కమతాలలో ఏరువాక కేంద్రం చేపట్టిన ప్రయోగాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. మినికిట్స్, విత్తనాల పంపిణీ, శిక్షణ, రైతులకు సలహాలు, వంటి కార్యక్రమాల నిర్వహణలో ఏరువాక కేంద్ర పరంగా అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్, రైతులు ముంద్రు వీరభద్రరావు, దాడి వెంకట్రావు పాల్గొన్నారు.



వరి సాగు క్షేత్రాలను పరిశీలిస్తున్న మునిరత్నం, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కేసులు



అనపర్తి బాలికోన్నత పాఠశాలలో మాట్లాడుతున్న జడ్జి ప్రసన్న

అనపర్తి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అనపర్తి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి రెడ్డి ప్రసన్న అన్నారు. అనపర్తి జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహం చేసిన తల్లిదండ్రులు, క్రతువు నిర్వహించిన అర్చకులు, కార్యక్రమానికి హాజరైన బంధువులపై కూడా కేసులు నమోదవుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీను నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కల్యాణి, న్యాయవాదులు రమణమూర్తి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతీ పీఠంలో పూజలు



జ్ఞాన సరస్వతీ పీఠంలో శుభలేఖ సుధాకర్, శైలజ దంపతులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గౌతమి ఘాట్‌లోని జ్ఞాన సరస్వతి పీఠాన్ని సినీ, టీవీ నటుడు శుభలేఖ సుధాకర్, గాయని ఎస్పీ శైలజ దంపతులు శుక్రవారం సాయంత్రం సందర్శించారు. వారికి మేళతాళాలు, పూర్ణకుంభంతో పీఠం మేనేజింగ్ ట్రస్టీ తోట సుబ్బారావు తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గోదావరికి సుధాకర్ దంపతులు నమస్కరించి, జ్ఞాన సరస్వతి దేవికి పూజలు చేశారు. పీఠం విశిష్టత, ఆలయ నిర్మాణం తదితర విషయాలను తోట సుబ్బారావు వివరించారు. గైడర్ పెన్ వర్క్స్ తరఫున సుధాకర్, శైలజ దంపతులకు గంగుమళ్ల లక్ష్మణరావు దంపతులు పెన్నులు బహూకరించారు. అలాగే వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి మాదిరాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రాకా కార్యదర్శి జీవీ రమణ, నిమ్మలపూడి గోవింద్, మున్సిపల్ డీఈ మదర్వా అలీ, భమిడిపాటి రామకృష్ణమూర్తి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కడియం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కడియం సీహెచ్‌సీ వైద్యులు మణి జ్యోత్స్న అన్నారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో డెంగీ, విష జ్వరాలు, వాంతులు/విరేచనాలు తదితర సమస్యలు ప్రభలుతాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, కొన్ని జాగ్రత్తలు పాటిస్తే వీటి బారిన పడకుండా ఉండొచ్చన్నారు. ఇళ్లలోని రుబ్బురోళ్లు, టైర్లు, కొబ్బరి బొండాలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీళ్ల ట్యాంకులపై మూతలు పెట్టాలన్నారు. అలాగే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది గ్రామాల్లో జ్వర సర్వే చేస్తున్నారన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని చేపడుతున్నారన్నారు. అవసరమైనచోట్ల వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. బాలికల వసతి గృహంలో ఏసీఎం, ఎబెట్ పిచికారీ జరిగిందన్నారు. మత్స్యశాఖ సహకారంతో గంబూషియా చేపలను నిల్వ నీటిలో విడుదల చేస్తున్నామన్నారు. ప్రజలు తమ వంతు బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

తెలుగుభాషా పరిరక్షణ సమష్టి బాధ్యత

- నన్నయ వీసీ ఆచార్య ప్రసన్న శ్రీ
- ఘనంగా తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలు

రాజానగరం: తెలుగుభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ అన్నారు. యూనివర్సిటీలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాషాభివృద్ధికి పాటుపడిన గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు, క్రీడాస్ఫూర్తినిచ్చిన ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో సోషల్ మీడియా సాధనాలు అనుసరిస్తున్న కొత్త పోకడలు తెలుగు భాషలోని ఔన్నత్యాన్ని దెబ్బతీస్తున్నాయన్నారు. బాల్యం నుంచి మాతృభాషపై పట్టుసాధించాలని, తెలుగు పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని, యువత క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, తెలుగు భాష విభాగం అధ్యాపకుడు డాక్టర్ తలారి వాసు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జీజీయూలో..

స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీలోని వ్యాయామ విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా ప్రఖ్యాత హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) పూలమాల వేసి, అంజలి ఘటించారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో క్రీడలను కూడా ఒక భాగం చేసుకోవాలంటూ క్రీడల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా కేక్‌ని కట్ చేసి, అందరికీ పంచారు.

- గైట్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీ మాధవి మాతృభాష ఆవశ్యకత, అవసరాన్ని తెలియజేశారు. మండలంలోని పలు పాఠశాలల్లో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. నామవరంలోని భారతీయ విద్యాభవన్‌లో గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

వాడుకభాషకు ప్రాణం

సీతానగరం: సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు మాట్లాడుతూ నేటి మన వాడుక భాషకు ప్రాణం పోసిన గిడుగు వారి కృషిని యువత తెలుగు భాషను మాట్లాడడంలో చూపించి గౌరవించాలని పిలుపునిచ్చారు. తెలుగు శాఖాధ్యక్షురాలు డాక్టర్ మోగంటి సుధామయి మాట్లాడుతూ సామాన్యునికి సాహిత్య ఫలాలు అందాలంటే వాడుక భాషే శరణ్యమన్నారు. అనంతరం తెలుగు పద్య పఠన పోటీల విజేతలు రామదుర్గ, శ్రీలక్ష్మి, సంతోషి, రాణిలకు పుస్తకాలను బహూకరించారు.

తియ్యని భాష తెలుగు

బిక్కవోలు: తేనేలొలికే తియ్యని భాష తెలుగు అని కొంకుదురు ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం మాదిరెడ్డి శ్రీనివాసరావు అన్నారు. గిడుగు వెంకట రామ్మూర్తి, ధ్యాన చంద్ జయంతిని పురస్కరించుకుని, వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వివిధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మల్లిడి కోదండ రామచంద్రారెడ్డి, ఎస్ఎస్ఆర్ ఎం రామారెడ్డి సమకూర్చిన బహుమతులను సర్పంచ్ సత్తి వీరమణి, ఎంపీటీసీ కొంకుదురు పీవీ, సొసైటీ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, సొసైటీ మాజీ సర్పంచి సత్తి నాగిరెడ్డి రాజా, నీటిసంఘం అధ్యక్షుడు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి తదితరులు విజేతలకు అందజేశారు.



'నన్నయ'లో రామ్మూర్తి పంతులు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పుష్పాంజలి



జీజీయూలో కేక్ కట్ చేస్తున్న చాన్సలర్ చైతన్య రాజు



సీతానగరం డిగ్రీ కళాశాలలో విద్యార్థినికి పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్



కొంకుదురు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బహుమతుల ప్రదానం